విశాల భారతి Real Talk
రియల్ టాక్
www.vishalabharati.com
epaper:vishalabharati.com
SPECIAL EDITION
International Women's Day
1
ఆదివారం, 09.03.2025
హైదరాబాద్





ఆడపిల్లగా అడుగుపెట్టి... అన్నింట్లో తనకు తానుగా నిలిచింది. భర్త చాటు భార్యగా, తండ్రి గారాల పట్టిగా ఉండటం కంటే.. భర్తకు మద్ధతుగా నిలుస్తూ, తండ్రికి చేదోడుగా ఉంటూ స్వశక్తితో నిలబడుతుంది. భర్త ఉద్యోగైనా, వ్యాపార రంగంలో ఉన్నా.. తానేమి తక్కువ కాదంటూ ఇంటి పోషణ నుంచి మొదలుకుని ఉద్యోగ, వ్యాపార బాధ్యతల్లోనూ అన్ని తానై నడిపిస్తోంది. కుటుంబం కోసం తనవంతుగా ఎన్నో పాత్రలను సునాయాసంగా పోషిస్తూనే ఇంటికి వెలుగునిచ్చే దివ్వెలా మారింది. వంటింటి కుందేళ్లనే భావన నుంచి ఉరుకుల పరుగుల జీవితంలోనూ అందనంత వేగంతో విహంగ పయనం చేస్తోంది. ఇదేదో ఆమె మహిళ దినోత్సవం సందర్భంగా చెబుతున్న మాటలు కావివీ. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా... నవ్వుతూనే నెట్టుకొచ్చేదయంలో ఆమెదే పైచేయి. వ్యాపార, ఆర్థిక బాధ్యతల నిర్వహణ, కుటుంబ పోషణలో మహిళల భాగస్వామ్యం ఎంతో కీలకమైన సందర్భంలో... ఆమె ప్రమేయం లేకుండా ముందుకు సాగడంలేదనీ తేలింది. భర్త బాగోగులు చూసుకోవాలన్నా... పిల్లలకు మెరుగైన విద్యను అందించాలన్నా... కుటుంబ వ్యాపారాన్ని విస్తరించాలన్నా... ఆర్థికపరమైన అంశాల్లో కీలక నిర్ణయాలు తీసుకునే సందర్భంలోనూ ఆమె భాగస్వామ్యమే కొండంత బలంగా మారుతోంది. తాను చేసేది చిన్న, పెద్దదనే భావన లేకుండా కుటుంబానికి తగినంత సమయం కేటాయించి కంటికి రెప్పలా చూసుకుంటుంది. ఇటీవల అన్నింట్లో సగం అన్నట్లుగా పోటీ ప్రపంచంలో దూసుకుపోతున్న ఆమె... తనకున్న శక్తి, సామర్థ్యాలను కూడగట్టుకుని అత్యంత ప్రభావశీలిగా నిలుస్తోంది. భర్త ఉద్యోగం చేసి, ఇంటికి వచ్చి పోవడం వరకే, కానీ తాను మాత్రం భార్యగా, కంటికి రెప్పల చూసుకునే తల్లిగా, కోడలిగా, ఇంటి యజమానిగా, వ్యాపార భాగస్వామిగా జీవితంలో ఎన్నో పాత్రలను సునాయాసంగా పోషిస్తోంది. ఇలా ఎన్నో వైవిధ్యమైన రంగాల్లో మహిళలు రాణిస్తుండగా... రియల్ ఎస్టేట్ రంగంలోనూ రాణిస్తూ, అన్నింట్లోనూ తామే అన్నట్లుగా పరిపూర్ణంగా తమ సత్తా చాటుకుంటున్న మహిళ పారిశ్రామికవేత్తలతో ఈ వారం విశాలభారతి రియల్ టాక్.



# అన్నింట్లోనూ సగం... ఆమెతో పరిపూర్ణం

## రియాలిటీలో రియల్ కథనాయికలు

### రియల్ ఎస్టేట్ రంగంలో రాణిస్తూ అతివలకు స్ఫూర్తి

### అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

విశాలభారతి, హైదరాబాద్ :

ఇంట్లో అందరూ వ్యాపారులే. హోమ్ మెయిడ్స్ అన్ని పనులు చక్కబెడతారు ఇంకేంటీ అనుకున్నా.. ఇందులో ఇంటి నిర్వహణ బాధ్యతలన్నీ తన చేతుల మీదుగానే చేసే మహిళలు ఇటీవల ఎక్కువైపోయారు. పిల్లల చదువు, షాపింగ్, ఇంటి నిర్వహణ, ఆరోగ్య జాగ్రత్తలు అన్ని కూడా అతివ చేస్తే గానీ ముందుకు సాగడం లేదు. ఉద్యోగస్తులైన కుటుంబాల్లో ఆమెదే సింహాభాగం ఉంటే... వ్యాపారాల్లోనూ ఆమె సముచిత స్థానాన్ని సొంతం చేసుకుంటోంది.

**అన్నింట్లోనూ ఆమెకు ప్రాధాన్యత...**

పెళ్లి తర్వాత ప్రాధాన్యతలు మారిపోయే ఆడపిల్లకు, కొత్తింటి కోడలిగా మొదలయ్యే ఆమె బాధ్యతలు తల్లిగా ఆమె పాత్రను మరింత పెంచుతాయి. అలా రూపాంతరం చెందుతున్న క్రమంలోనూ ఎన్నో ఒత్తిళ్లకు గురవుతుంటారు. కానీ అవన్నీ నాణేనానికి ఒకవైపు అన్నట్లుగా... అవసరానికి తగినట్లుగా తన రూపంలో ఒదిగిపోతుంది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెట్రో నగరాల్లోనూ ఉద్యోగం, ఫ్యామిలీ, ఫ్రెండ్స్, రిలేషన్స్ పెంపొందించడంలో మహిళలే ముందున్నారు. ఉద్యోగం చేసే మహిళలకు కుటుంబ పోషణ ఏం తెలుస్తుందనే పాత సంప్రదాయాలకు స్వస్తి చెబుతూ, తాను లేకుంటే ఏదీ జరగదనే స్థాయిలో డిసిషన్ మేకర్లుగా మారారు. ఇంటి, వ్యాపార వ్యవహారాల్లో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా.. తల్లిదండ్రులు, భర్తలతో కలిసి మరీ పని చక్కబెట్టడంలో వీరే సమర్థులుగా నిలుస్తున్నారు. ముఖ్యంగా ప్రోగ్రెసివ్ ఆలోచనా విధానాలతో ఏ స్థాయి ఉద్యోగాలు, బాధ్యతలనైనా చేతిలో గరిటెను తిప్పినంత సునాయాసంగా చక్కబెట్టేస్తున్నారు.

**రియాలిటీలో రియల్ హీరోలుగా...**

మహిళల ప్రాతినిధ్యం అతి తక్కువగా ఉండే నిర్మాణ రంగంలోనూ కుటుంబ బాధ్యతలను భుజాన మోసినంత సులభంగా చక్కబెట్టే వారి సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా మెట్రో నగరాల్లో ఈ రంగంలో గణనీయమైన మార్పులతో మహిళ పాత్ర పెరిగింది. ఈ క్రమంలో ఎంతో మంది కుటుంబ వ్యాపారాలను భుజనా వేసుకున్న అతివలు ఆ జాబితాలో చేరుతున్నారు. నిర్మాణ రంగంలోనూ సేల్స్ మేనేజర్ల నుంచి సైట్ ఇంజనీర్ల వరకు తాను చేయలేని పనే లేదన్న స్థాయిలో నిలబడుతున్నారు. అలా రియల్ ఎస్టేట్ రంగంలోనూ తండ్రికి కొడుకుల్లా, భర్తలతో సమానంగా పనిచేస్తూ తన పరిధిని పెంచుకంటున్నారు.




### అవధుల్లేని ఉత్సాహంతో అన్నిట్లోనూ సమర్థులే...



పెళ్లి తర్వాత మారిపోయే ప్రాధాన్యతలతో... వ్యాపార రంగంలో అడుగుపెట్టే మహిళ ఎన్నో సవాళ్లను ఎదుర్కొవాల్సి వస్తుంది. ముఖ్యంగా కుటుంబపోషణ, పిల్లల ఆలనా పాలనతో, ఇంటిల్లిపాదికి చేదోడుగా ఉండే క్రమంలో ఎంతో సమర్ధవంతంగా పనిచేయగలిగాలంటే.. గిరి గీసుకునే ఒకే చట్రంలో ఉంటే సరిపోదు. అన్ని పనులను నేర్చుకున్నప్పడు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే గుండె ధైర్యం వస్తుంది. అలాంటి పెంపకం నుంచి వచ్చిన నాకు.. ముందుగా నాన్న, ఆ తర్వాత భర్త ప్రోత్సహంతోపాటు, ఇంట్లో ఉండే పిల్లల సహకారం కూడా వ్యాపార రంగంలోనూ నా పాత్రను సమర్థవంతంగా పోషించగలిగే అవకాశం వరించింది. అయితే ఇదంతా కూడా బయట నుంచి చూసినంత సులభం కాకపోయినా... ఏదైనా చేయగలమనే ఆత్మవిశ్వాసమే అన్నింట్లోనూ తన బాధ్యతలను సమర్థవంతంగా చక్కబెట్టే వీలు కలుగుతుంది. ఏ రంగంలోనైనా మహిళ రాణించాలంటే ప్రణాళికబద్ధతమైన విధానాలతోనే సాధ్యం అవుతుంది. అప్పడే అటు కుటుంబంలోనూ, ఇటు వ్యాపారంలోనూ తన పాత్రను పదిలం అవుతుంది. ఉన్నత ఆశయంతో ముందుకు సాగే క్రమంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరించినప్పడే... తామేమి తక్కువ కాదని నిరూపించుకోగలుగుతాం. అలా అడుగుపెట్టి ఇవాళ రియాల్టీలో నిలిచానంటే... పరిమితుల్లేకుండా ఉండటంతోనే సాధ్యపడుతుంది.

- సౌమ్య చందా, వాసవీ గ్రూప్, డైరెక్టర్

### ఒత్తిడిలో జగజ్జేతలే...



అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత పెరిగింది. అందరీలాగే నాన్నకు గారాల పట్టిగా మొదలైన నా ప్రయాణం... విదేశాల్లోనే ఎంఎస్ చేసిన తర్వాత అక్కడే ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించే స్థాయికి చేరాను. ఈ స్థాయికి ఓ ఆడపిల్లగా చేరగలిగానంటే దానికి కుటుంబ ప్రోత్సాహం అత్యంత కీలకం. ఒకప్పడు ఇంటి పట్టున మాత్రమే ఉండే మహిళలు కూడా... ఎంతో సమర్థవంతంగా, నిబద్ధతతో అన్ని రంగాల్లో తన ప్రాధాన్యతను పెంచుకుంటున్నారు. ముఖ్యంగా నేటి తరం యువతులు ఒక రంగానికి మాత్రమే పరిమితం కావడం లేదు. అన్నింట్లోనూ తన ఉనికి చాటుతున్నారంటే కుటుంబఅవసరాలు, ఆమె పోషించే బాధ్యతలనే చెప్పాలి. అలాంటి వాతావరణం నుంచే వచ్చిన నేను కూడా ఎంతో క్లిష్టమైన నిర్మాణ రంగంలో అడుగుపెట్టి... ముందుకు సాగుతున్నా. ఇతర రంగాలతో పోల్చితే ఈ రంగంలో పురుషాధిపత్యం ఎక్కువే ఉంటుంది. కానీ సమర్థవంతంగా కుటుంబ బాధ్యతలను నిర్వర్తించిన అమ్మనాన్న, లేద కుటుంబం ప్రోత్సాహం ఉంటే... ఎలాంటి సవాళ్లను అధిగమించగలిగే సామర్థ్యం వస్తుంది. ముఖ్యంగా ఏ రంగంలోనైనా రాణించాలంటే ఆ రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకుని, అవగాహనకు పదును పెడితే... అతివననే భావన తొలగి అత్యున్నత స్థానాన్ని అధిరోహించవచ్చు. ఇంటికే పరిమితం చేయకుండా వెన్నుతట్టి ప్రోత్సహిస్తే కొండ ఒత్తిడిలోనూ అద్భుతాలకు ఆమె చిరునామాగా నిలుస్తూ జగజ్జేతలుగా నిలుస్తారు.

- చైత్రా రెడ్డి, సీవోవో, ఆర్‌వీ నిర్మాణ్

### వారి ప్రోత్సహంతో ఉన్నత స్థాయికి



నిర్మాణ రంగంలోనే ఉన్నా అమ్మనాన్నలను చూస్తూనే ఈ రంగంలోకి అడుగు పెట్టాను. కంపెనీ ప్రారంభించిన సమయంలో నాన్నకు అమ్మ తోడుగా ఉన్నట్లుగానే... నాన్నతోపాటే నేను కంపెనీ వ్యవహారాలను నిర్వర్తిస్తున్నాను. ప్రస్తుతం నాతోపాటు సోదరీ శివగంగా కూడా పూర్తి స్థాయి నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టి కుటుంబ సభ్యుల సారథ్యంలో కంపెనీ వ్యవహారాలను చక్కబెట్టుస్తున్నాం. ఇక తల్లిదండ్రుల బాధ్యతలను భుజాన వేసుకుని కూతులిద్దరూ కంపెనీకి ప్రాతినిధ్యం వహిస్తున్నామంటే... మా ముందు తరంలో ఉన్న నాన్న, భర్త యొక్క తల్లిదండ్రుల మంచి పెంపకమే కారణమని చెప్పాలి. ఓ మహిళగా వారి తల్లి సమర్థవంతమైన పోషణతోనే, ఆ కుటుంబాల నుంచి మహిళగా ఇవాళ తమ ఉనికి చాటుకోగలుగుతున్నాం. ఇక వ్యాపార రంగంలో ముఖ్యంగా అతి తక్కువ మంది ఉండే నిర్మాణ రంగంలోనూ ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ... కొండంత అండగా... వెన్ను తట్టి నడిపించే నాన్న, భర్త ప్రోత్సాహంతో నా పాత్రను కుటుంబంలోనూ, వ్యాపారంలోనూ మరింత సమర్థవంతంగా పోషిస్తున్నాను. తండ్రికి కూతురుగా, భర్తకు భార్యగా మహిళ ప్రాధాన్యత పెరుగుతున్న ఈ రోజుల్లో చిన్న ప్రోత్సహమే ఆమెను అందనంత స్థాయికి చేర్చుతుంది.

శివానీ రెడ్డి, మేనేజింగ్ పార్టనర్, రామిరెడ్డి కన్‌స్ట్రక్షన్స్